క్లుప్తంగా

బీడీ కార్మికులకు జీవనభృతి ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్‌దే



బీడీ కార్మికులను ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

కథలాపూర్: బీడీ కార్మికులను గుర్తించి వారికి ప్రతీ నెల జీవనభృతి ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని ఆ పార్టీ జిల్లా నాయకుడు లోక శిధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని భూషణరావుపేటలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆదివారం ఇంటింటా ప్రచారం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొండ అంజనేయులు, నాయకులు బద్దం మహేందర్, గడ్డం శేఖర్‌రెడ్డి, తీట్ల శంకర్, ప్రిన్స్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల గులాబీమయం



బీఆర్‌ఎస్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

జగిత్యాలటౌన్: బీఆర్‌ఎస్ ఫ్లెక్సీలు, హోర్డింగులు, జెండాలు, తోరణాలతో జగిత్యాల పట్టణం గులాబీమయంగా మారింది. ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జగిత్యాల పట్టణంలో ఆదివారం సాయంత్రం బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ రోడ్‌షోను పురస్కరించుకుని పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రహదారుల వెంట బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు భారీ ఫ్లెక్సీలు, జెండాలు, తోరణాలు, హోర్డింగులు ఏర్పాటు చేయడంతో పట్టణమంతా గులాబీమయంగా మారిపోయింది.

అమిత్‌షా సభకు తరలిన బీజేపీ నాయకులు

మల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన అమిత్‌షా సభకు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆదివారం తరలివెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లవంగ శివకుమార్, పట్టణ అధ్యక్షుడు సోమ అశ్విన్, బూత్ కమిటీ అధ్యక్షుడు పుప్పాల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ఎన్డీయేనే అధికారంలోకి రావాలి



పూజలు చేస్తున్న ఐపీఎఫ్ నాయకులు

మల్లాపూర్: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయేనే మళ్లీ అధికారంలోకి వస్తుందని ఇండియన్ పీపుల్స్ ఫోరమ్ కన్వీనర్ కుంబాల మహేందర్ అన్నారు. ఆదివారం అబుదాబిలోని ప్రసిద్ధ హిందూమందిరంలో లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధించాలని ఐపీఎఫ్ ఆధ్వర్యంలో 100మంది గల్ఫ్ కార్మికులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలి



సుజిత్ రావును సన్మానిస్తున్న నాయకులు

మెట్‌పల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకపోవాలని పీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు సూచించారు. జగిత్యాల, బాల్కొండ నియోజకవర్గాలను పార్టీ ఆయనను స్పెషల్ కోఆర్డినేటర్‌గా నియమించగా, ఆదివారం పలువురు నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అందె మారుతి, ఖుత్బొద్దీన్, కూన గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ కో ఆర్డినేటర్‌కు సన్మానం

ఇబ్రహీంపట్నం: నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జగిత్యాల, బాల్కొండ నియోజకవర్గాల స్పెషల్ కోఆర్డినేటర్‌గా నియమితులైన టీపీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్ రావును ఆదివారం ఇబ్రహీంపట్నంలో నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ వాకిడి సత్యంరెడ్డి, ఫిషర్ మెన్ మండల అధ్యక్షుడు మగ్గిడి నందం, మల్లాపూర్ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జిల్లెలకుంటకు మరమ్మతు ఎప్పుడో..?

- పెరగనున్న భూగర్భజలాలు
- వన్యప్రాణులకు అందనున్న తాగునీరు
- గతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్మాణం



తెగిపోయిన మత్తడి, కట్ట



జిల్లెలకుంటలో నీరు నిల్వ ఉండే ప్రాంతం

సారంగాపూర్: అధికారుల నిర్లక్ష్యంతో మండలంలోని జిల్లెల కుంట ఆనవాళ్లు లేకుండా పోతోంది. ఏళ్ల క్రితం మండలంలోని లక్ష్మీదేవిపల్లి, సారంగాపూర్ గ్రామాల మధ్య అటవీప్రాంతంలో దీనిని ఏర్పాటు చేశారు. చుట్టూ గుట్టలు, గుట్టల మధ్య ఉండడంతో వర్షాకాలంలో గుట్టలపై నుంచి వచ్చే నీటితో పాటు, వాగుల ద్వారా వచ్చే నీటితో ఈ కుంట నిండుకుంటుంది. దీంతో దిగువన ఉన్న రైతుల బావుల్లో భూగర్భజలాలు భారీగా పెరుగుతాయి. దీంతో పాటు అడవిలో ఉండే వన్యప్రాణులకు ఇది ప్రధాన నీటి ఆధారం.

ప్రస్తుతం కుంట పరిస్థితి....

ఏళ్ల క్రితం అటవీశాఖ ఈ కుంటను ఏర్పాటు చేసినప్పటికీ ఆ తరువాత కుంట మరమ్మతులకు నోచుకోలేక కుంటలో నీరు నిల్వ ఉండడం లేదు. వర్షాలు, వరదలకు ఎగువ నుంచి వచ్చిన నీరు వచ్చినట్లు దిగువకు వెళ్లిపోతున్నాయి. దాదాపు 150 మీటర్ల పొడవు, 5 మీటర్ల ఎత్తుతో ఉన్న కట్ట కోతకు గురైంది. కట్ట కోతకు గురికాకుండా తాత్కాలికంగా బండరాళ్లతో ఆనకట్ట కట్టినా.. నీరు నిలవడం లేదు. దీని మత్తడి కూడ పూర్తిగా ధ్వంసమై కూలిపోయింది. దీంతో జిల్లెల కుంట రోజు రోజుకు ఆనవాళ్లు లేకుండా పోతోంది.

కుంటలో కొనసాగుతున్న ఉపాధి పనులు

జిల్లెల కుంటలో ఉపాధిహమీ కూలీలు సమతుల కందకాలను తవ్వుతున్నారు. భూగర్భ జలాల పెంపుకోసం తవ్వుతున్న కందకాల మట్టి తిరిగి వర్షాలు పడగానే సమతుల కందకాలు కూలిపోయి యథాస్థితికి చేరే అవకాశం ఉంది. కుంటలో ఉపాధిహమీ కూలీలు తవ్విన మట్టిని కనీసం కట్టకు చేర్చితే కట్ట ఎత్తుపెరగడం, కట్ట బలపడేందుకు వీలుంటుంది. దీని కోసం రూ. 4 లక్షల వరకు ఖర్చు అవుతుందని పలువురు పేర్కొంటున్నారు.

చింతల చెరువుకులోకి ఎస్సారెస్పీ నీరు తీసుకువచ్చే కాలువకు అనుసంధానం చేయాలంటున్న రైతులు ఇటీవల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కలిశారు. సారంగాపూర్ శివారుల్లోని చింతల చెరువులోకి ఎస్సారెస్పీ నీటిని తరలించాలని రైతుల కోరిక మేరకు ప్రభుత్వం సర్వే చేయించింది. చింతల చెరువులోకి కట్టుకాలువ ద్వారే వెళ్లే నీటిని కొంత జిల్లెల కుంటలోకి తరలిస్తే కుంటలో ఏడాది పొడవునా నీరు నిలువ ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. దీని ద్వారా వన్యప్రాణులకు ఎప్పుడూ తాగునీరు అందుబాటులో ఉంటుంది. దీనిపై అటవీశాఖ అధికారులను సంప్రదించగా దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని నిధులు మంజూరు కాగానే కుంటకు మరమ్మతులు చేపడతామని పేర్కొన్నారు.

మరమ్మతు చేపట్టాలి



జిల్లెల కుంటకు మరమ్మతులు చేసి నీటిని నిలువ ఉండేలా చర్యలు తీసుకోవాలి. దీని ద్వారా జిల్లెలకుంట కింద ఉన్న దాదాపు 200 ఎకరాల వ్యవసాయ బావుల్లో భూగర్భజలాలు పెరిగేందుకు వీలుంటుంది. అధికారులు స్పందించి కుంటకు మరమ్మతులు చేయించాల

– ఆసాల రాజయ్య, సారంగాపూర్

కుంటలో నీరు చేరడం అవసరం



జిల్లెల కుంటలో నీరు చేరితో వన్యప్రాణులకు ఏడాది పొడవునా తాగునీరు అందుబాటులో ఉంటుంది. కుంటలో నీరు లేక తాగునీటి కోసం వన్యప్రాణులు రోడ్ల మీదికి వస్తున్నాయి. అధికారులు వన్యప్రాణుల కోసమైనా ఈ కుంటకు పూర్తిస్థాయి మరమ్మతులు చేయాలి.

– ఏలూరి రాజిరెడ్డి, సారంగాపూర్

హోం ఓటింగ్‌తో దివ్యాంగుల్లో సంతోషం



దివ్యాంగుడితో ఓటు వేయిస్తున్న సిబ్బంది

పెగడపల్లి: వందశాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా 80 ఏళ్లు దాటినా వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దే ఓటేసే సౌకర్యం కల్పిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి ఎన్నికల సంఘం ఈ విధానం అమల్లోకి తీసుకొచ్చింది. పెగడపల్లి మండలంలో 40 మంది దివ్యాంగులు, 25 మంది 80 ఏళ్లు దాటిన వృద్ధులున్నారు. వీరిలో ఒక దివ్యాంగుడు మృతి చెందగా 64 మంది ఓటర్ల ఇళ్లకు వెళ్లిన అధికారులు వారితో ఓటు వేయించడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈసందర్భంఆ ఇంటి నుంచి ఓటుహక్కు వినియోగించుకున్న వృద్ధులు, దివ్యాంగులను ఆదివారం సాక్షి పలుకరించగా వారు సంతోషం వ్యక్తం చేశారు. ఇంట్లోనే ఓటేయడం ఆనందంగా ఉందని, కదలనేని స్థితిలో ఉన్న తమ లాంటి వృద్ధులకు ఓటు సౌకర్యం కల్పించడం సంతోషంగా ఉందని గంగ్ర రాజేశ్వర్‌రావు అన్నారు. ఇంటి వద్ద ఓటేసిన పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటేసినట్లు అనిపించిందని అనంతుల రామకృష్ణ అనే దివ్యాంగుడు తెలిపారు. ఇంటికి వచ్చి ఓటేయించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వీసీఐ ఎన్నికల్లో వెటర్నరీ కళాశాల ప్రొఫెసర్ పోటీ

కోరుట్ల: పట్టణ శివారులోని పీవీ నరసింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ రాధా కృష్ణా వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నిక జూన్ 8న జరుగనుంది.

కేసీఆర్ సభకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు

కోరుట్ల రూరల్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అదినేత కేసీఆర్ జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి నిర్వహించే రోడ్‌షోకు మండలం నుంచి బీఆర్‌స్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఎంపీపీ తోట నారాయణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, సీనియర్ నాయకుడు చీటి వెంకట్రావు, పలువురు ఎంపీటీసీలు,సింగిల్‌విండో చైర్మన్లు, మాజీ సర్పంచులు,నాయకులు వెళ్లారు.

మేడిపల్లి: జగిత్యాలలో నిర్వహించిన కేసీఆర్ రోడ్ షోకు మండలంలోని దాదాపు అన్ని గ్రామాల నుంచి భారీగా బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. కార్యక్రమానికి అంగడి ఆనంద్, క్యాతం సత్తిరెడ్డి, నెల్లుట్ల ప్రభాకర్, ఉదిగిరి ఆదిరెడ్డి, ఉరుమట్ల చిన్నరాజం, ముఖ్యనాయకులు తరలివెళ్లారు.

రాజ్యాంగ వ్యతిరేక బీజేపీ, బీఆర్‌ఎస్‌ను ఓడించండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టీజేఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం: రాజ్యాంగ వ్యతిరేక బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ఓడించాలని తెలంగాణ జనసమితి పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కంతి మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిజామాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా కరపత్రాలు ఆవిష్కరించారు. విభజన హామీలు నెరవేర్చని బీజేపీకి, అన్ని వర్గాలను మోసం చేసిన బీఆర్‌ఎస్‌కు ఓటేయొద్దని కోరారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునే బాధ్యత ప్రజలదే అన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట శంకర్, రెబ్బటి మల్లయ్య, మండల అధ్యక్షుడు కంతి రమేశ్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ మోసపూరిత వాగ్దానాలు నమ్మొద్దు

జగిత్యాలరూరల్: బీజేపీ మోసపూరిత వాగ్దానాలు ప్రజలు నమ్మవద్దని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బాపురెడ్డి అన్నారు. ఆదివారం రాయికల్ పట్టణంలోని 11వ వార్డులో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్ కు మద్దతుగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు తురగ శ్రీధర్ రెడ్డి, లతిక, మహేందర్, మహేష్ గౌడ్‌లు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



ఇంటింటా ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

జగిత్యాలటౌన్: అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవనన్నకు ఓటు వేసి అండగా నిలవాలని జగిత్యాల బల్దియా చైర్ పర్సన్ అడువాల జ్యోతి కోరారు. ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని 6,22,25వ వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

పద్మశాలీలు కాంగ్రెస్‌కు అండగా నిలవాలి

పద్మశాలీలు జీవన్‌రెడ్డికి అండగా నిలవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి కోరారు. జిల్లా కేంద్రంలో ఆదివారం పద్మశాలీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. టీజీఎండీసీ చైర్మన్, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పద్మశాలీలకు, చేనేత వర్గానికి అండగా ఉండి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు గిరి నాగభూషణం, విజయలక్ష్మి, కొత్త మోహన్, ఎలిగేటి నర్సయ్య, గాజంగి నందయ్య, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్‌కు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, కొల్ముల రమణ, పార్టీ అధ్యక్షుడు నారపాక రమేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

కథలాపూర్: మండలంలోని పోసానిపేట మాజీ సర్పంచ్ మిట్టపెల్లి గంగారెడ్డి ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గంగారెడ్డికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అదే గ్రామానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్ అనంతరెడ్డి, ఎన్ఆర్ఐ ఆకుల రాజేందర్, నాయకులు అశోక్, రాములుగౌడ్‌తోపాటు 15 మంది కాంగ్రెస్‌లో చేరారు.

బీజేపీ నాయకుల ప్రచారం

బుగ్గారం: మండలంలోని వివిధ గ్రామాల్లో బీజేపీ నాయకులు ఆదివారం విస్తృత ప్రచారం చేపట్టారు. బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌కు ఓటేయాలని కోరారు. మద్దునూర్‌లో రాయిల్ల రవికుమార్ ఆధ్వర్యంలో గడపగడపకూ ప్రచారం చేశారు. నాయకులు వైకుంఠం,విజ్జగిరి సందీప్,ఆకుల రాజు,వంశీకృష్ణ పాల్గొన్నారు.

యశ్వంతరావుపేట గ్రామానికి చెందిన పలువురు ఆదివారం బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

కథలాపూర్: మండలంలోని దూలూర్‌లో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఐదు చేతుల పోచమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. బోనాలతో భక్తులు ఆలయం వరకు ఊరేగింపుగా చేరుకుని దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పెగడపల్లి: మండలంలోని రెండు గ్రామాల్లో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. ఏడుమోటలపల్లిలో ఊరంతా, నందగిరిలో రెడ్డి, మున్నూరు కాపులు పండుగ జరుపుకున్నారు. మహిళలు బోనాలు నెత్తిన ఎత్తుకుని డప్పుచప్పుళ్ల శివసత్తుల పూనకాలతో ర్యాలీగా ఆలయాలకు చేరుకుని. పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రెండిళ్లలో చోరీ



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

మేడిపల్లి(జగిత్యాల): కట్లకుంట గ్రామంలోని రెండిళ్లలో చోరీ జరిగింది. దుండగులు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. కుంట రాంరెడ్డి శనివారం ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆదివారం తెల్లవారుజామున దొంగలు తాళం పగులగొట్టి, సుమారు 10 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి, రూ.17 వేలు చోరీ చేశారు. అలాగే, కథాలపురప్ప రాధ ఇంట్లోనే నిద్రించగా.. దొంగలు పడి, 3 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎస్సై నవీన్‌కుమార్, క్లూస్ టీం బాధితుల ఇళ్ల వద్దకు చేరుకొని, వివరాలు, ఆధారాలు సేకరించారు. గ్రామంలో మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు పర్యటించారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

ధర్మపురి: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఆర్ఎంపీ, పీఎంపీ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి లక్ష్మణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జెడ్పీ చైర్మన్‌గా ఉన్నప్పుడు సంఘ భవనానికి రూ.4.60లక్షలు మంజూరు చేశామన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గడ్డం వంశీని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల ఆర్ఎంపీలు, పీఎంపీలు పాల్గొన్నారు.

బీరుసీసాతో దాడి చేసిన వ్యక్తిపై కేసు

వెల్గటూర్ : బీరుసీసాతో దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం కప్పారావుపేటకు చెందిన గాజుల రాజేందర్‌కు నిందితులకు మధ్య చిన్న గొడవ జరిగింది. ఈ గొడవను మనసులో పెట్టుకుని శనివారం రాత్రి బైరం అజయ్, చింతకింది తరుణ్, బైరం సిద్ధు, గంగుల అభిలాష్, మరి కొంతమంది యువకులు కలిసి రాజేందర్ ఇంటిపై బీరుసీసాలతో దాడిచేసి అతడి తండ్రి లచ్చయ్య, అన్న రాకేశ్ ను గాయపరిచారు. తన తండ్రి, అన్నలపై దాడి చేసినట్లు రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సమయం లేదు.. ప్రచారంలో స్పీడు పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

సారంగాపూర్: సమయం తక్కువగా ఉందని, ప్రచారంలో వేగం పెంచాలని నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి టి. జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పెంబట్ల-కోనాపూర్ సింగిల్‌విండో చైర్మన్ గుర్నాథం మల్లారెడ్డి, పెంబట్ల తాజా మాజీ ఉపసర్పంచ్ తోట లక్ష్మీ తమ అనుచరులతో కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తోడేటి శేఖర్‌గౌడ్, కోంద్ర రాంచంద్రారెడ్డి, ముద్దం చిరంజీవి, తోట రాము, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో కాంగ్రెస్ నాయకులు ఆదివారం కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి ఓటు వేయాలని విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీలు కోల జమున, మసర్తి రమేశ్,మహంకాళి రాజన్న పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: రాయికల్ మండలం ఇటిక్యాల మాజీ వార్డు సభ్యుడు, బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేల్పుల లక్ష్మణ్, బొమ్మెన ముత్తన్న, ఎండీ షఫీ, పుల్లరి రాజేశ్, స్వామి, తదితరులు జీవన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

సేవా కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందాలి



నూతన కార్యవర్గంను సన్మానిస్తున్న సభ్యులు

మల్లాపూర్: లయన్స్ క్లబ్ సామాజిక, సేవాకార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందాలని లయన్స్ క్లబ్ రిజీయన్ చైర్మన్ శివ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సేవా కార్యక్రమాలే ఏకైక లక్ష్యంగా పనిచేస్తూ ప్రజలతో మమేకమవుతుందన్నారు. సామాజిక సేవలందించంలో లయన్స్‌క్లబ్ ముందుంటుందన్నారు. లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోట రాజారాం, కార్యదర్శిగా సుతారి రాజేందర్, కోశాధికారిగా మార్గం రాజేశ్వర్, ఉపాధ్యక్షులుగా తోట రాజరెడ్డి, క్యాతం సురేష్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా దారిశెట్టి చిన్నారెడ్డి, పీఆర్‌వోగా ముత్యాల రమేశ్‌ను ఎన్నుకుని నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో రిజీయన్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, చార్టెడ్ ప్రెసిడెంట్ దేవ మలయ్య, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కనుక సంజీవ్, కార్యదర్శి తోట రాజరెడ్డి, కోశాధికారి ఇర్రి జైపాల్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

భూమయ్య మరణం తీరని లోటు



నివాళి అర్పిస్తున్న మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి

వెల్గటూర్ : ఎంఈవో బత్తుల భూమయ్య అకాల మరణం తీరని లోటని మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆదివారం చొప్పదండిలోని భూమయ్య స్వగృహంలో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పుట్టెడు దు:ఖంలో పరీక్షకు హాజరు

తండ్రి మృతిచెంది పుట్టెడు దు:ఖంలో కూడా భూమయ్య కూతురు అక్షయ ఆదివారం నీట్ పరీక్షకు హాజరైంది ఆదివారం సెలవు దినం కలిసివస్తుందని, తానే దగ్గరుండి కూతురును పరీక్షకు తీసుకెళదామని భూమయ్య అనుకున్నారు. కానీ పరీక్షకు ఒక్క రోజు ముందు భూమయ్య హఠాన్మరణం చెందాడు. తండ్రి లక్ష్యాన్ని నెరవేర్చాలనే సంకల్పంతో కూతురు నీట్ పరీక్షకు హాజరైంది.

ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో రాణించాలి

జగిత్యాలరూరల్: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి మైలారపు లింబ్రాది అన్నారు. ఆదివారం రాయికల్ పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవ రంగంతో పాటు ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. అనంతరం కార్యవర్గ సభ్యులు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గంప ఆనందం, రాజేష్, ఎలగందుల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు కూరగాయల రవి, గరిపెల్లి శ్రీనివాస్, పల్లెర్ల పవన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మేడిపల్లి: మండలంలోని కొండాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో 1998–99లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం గ్రామంలోని పద్మశాలీ కల్యాణ మండపంలో సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. తాము చదువుకున్నప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం లక్ష్మీనారాయణ,ఉపాధ్యాయులు రాజన్న , ప్రభాకర్, విద్యాసాగర్ రావు, నరసయ్య, వీరేశం, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని ఆర్‌బీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం స్థానిక వాణినీకేతన్ హైస్కూల్‌కు చెందిన 2003–04 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. వారికి చదువు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.